"అత్తయ్యా-వంట ఏం చెయ్యమంటారు?''

"ఏదో చెయ్యి నీ ఇష్టం వచ్చింది. ఇన్నాళ్ళూ నన్నడిగే చేస్తున్నావా? ప్రతీ పనీ నా ఆజ్ఞప్రకారం చేస్తున్నట్టు అడగటం దేనికి'' విసురుగా వచ్చిన జవాబుకి కల్యాణి ముఖం చిన్నబోయింది. మాట్లాడకుండా వంటగదిలోకి వెళ్ళిపోయింది.

"మందు వేసుకున్నావా?'' నారాయణరావు గారు భార్యని పలకరించి, "అమ్మా కల్యాణీ నా నీలం షర్ట్ కనిపించటంలేదేం? కొంచెం చూసి పెట్టు'' అన్నారు. యశోద గుడ్లప్పగించి భర్త వైపు చూస్తోంది. చొక్కా వెదికి పెట్టటానికి కూడా కోడలే కావాలా?.

"నిన్న ఇస్త్రీకి వేశానండీ. మీ బట్టలు టేబులు మీద తీసి పెట్టాను'' ఆయన తల పంకించి బట్టలు మార్చుకుని వెళ్ళిపోయారు. మరో నిముషంలో స్కూటర్ వెళ్ళిపోయిన చప్పుడు విన్పించింది.

"అమ్మా మందు వేసుకున్నావా? ఇవాళ ఎట్లా వుంది'' ప్రభాకర్ వచ్చి తల్లి ప్రక్కన కూర్చున్నాడు. యశోద కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఏదైనా తను కన్న బిడ్డ, కొడుకు మందు ఇస్తే వేసుకుంది. "సాయంత్రం వచ్చేటప్పుడు ఏమైనా కావాలామ్మా'' ఆప్యాయంగా అడిగాడతను.

"ఏం వద్దురా.'' నీరసంగా నవ్వింది యశోద.

"నిన్న డాక్టర్‌గార్ని చూసొచ్చాను. మీ అమ్మకి ఆరోగ్యం బాగానే వుంది. మనసులో ఏదో దిగులు పెట్టుకున్నారు అది తీరితే తొందరగా కోలుకుంటారని చెప్పారాయన హాస్పటల్లో వుండగా అంత తొందరగా కోలుకున్నావు. ఇంటి కొచ్చి దాదాపు నెలకావొస్తోంది. అయినా ఇంకా ఓపిక రాలేదంటే మరి-ఆయన మాట నిజమేనా.''

"పిచ్చితండ్రి నాకేం దిగులు'' రుద్ధ స్వరంతో అంది యశోద.

"నీకు తొందరగా తగ్గి లేచి తిరుగుతుంటే తృప్తిగా ఉంటుందమ్మా'' అతని మాట పూర్తి కాకముందే తడి తల తుడుచుకుంటూ వచ్చిన సుధాకర్ "వదిన్ని చూడగానే నువ్విలా మంచం ఎక్కటం ఏంబావోలేదు మమ్మీ. వదిన ఓపిగ్గా చేస్తున్నారు కదా అని ఇంకా ఎన్నాళ్ళు చేయించుకుంటావు?'' అన్నాడు. యశోదకి ఒళ్ళు మండింది. "నాకేం రోగం రావాలని కోరికలేదు. మీ వదిన గార్ని కష్టపెట్టాలని అంతకంటె లేదు'' అంది కటువుగా. సుధాకర్ ఊరుకోలేదు. "అందుకేనా-డాక్టర్‌గారు రోగం లేదన్నా మంచం వదలకుండా ఉన్నావు'' అని నవ్వుతూనే అన్నాడు. ఆ మాటకి యశోదకి ఆవేశం ముంచుకొచ్చింది.

"ఉంటారా నా ఇష్టం. నేను మంచాన ఉన్నానని మీకేం బాధ? మీ వదిన చెయ్యలేకపోతుందని తప్ప. నా బాధ ఎవరికీ పట్టదు. నా అవసరం మీకు లేదుగా. మీ వదినగారు ఉంది చాలు మీ మంచీ చెడూ చూడటానికి ...'' గబగబా మాట్లాడేసరికి నీరసం వచ్చింది. రొప్పుతూ తల పక్కకి తిప్పుకుంది యశోద. ప్రభాకర్ తమ్ముడి వైపు తీక్షణంగా చూసి, గబగబా గ్లూకోజ్ కలిపిన మంచినీళ్ళు తీసుకొచ్చి బ్రతిమాలుతూ తల్లిచే తాగించాడు.




"నువ్వెందుకిట్లా మాట్లాడుతున్నావో నాకు అర్థం కావటంలేదు.'' మెల్లగా అన్నాడు సుధాకర్. అతని ముఖంలో బాధ స్పష్టంగా కన్పిస్తోంది. నోరు మూసుకుని పద ఇక్కణ్ణించి. ఏదో వాగి అమ్మని బాధపెట్టటం తప్ప నీకు మరో పనిలేదు.'' ప్రభాకర్ తమ్ముణ్ణి బయటికి నెట్టుకుంటూ వెళ్ళాడు. యశోద అలసటగా కళ్ళు మూసుకుంది.

"వదినా-జడవెయ్యవా టైమవుతోంది'' కూతురి గొంతు విని ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. అప్పుడే తొమ్మిదయిందా. 'చిన్నా - నాదగ్గరికిరా' గట్టిగా పిలిచింది కూతుర్ని. జడలు విప్పుకుంటున్న పన్నెండేళ్ళ ప్రమద్వర పరిగెత్తుకుంటూ వచ్చింది.

"ఏంకావాలమ్మా'' అంటూ, మెల్లగా లేచి కూచుంటూ అంది యశోద - 'నేను వేస్తానురా.'

'నువ్వొద్దుపో నీకసలు చాతకాదు' వచ్చినంత వేగంగా వెళ్ళిపోయింది ప్రమద్వర. శాంతిస్తున్న సముద్రంలో మళ్ళీ తుపాను చెలరేగినట్లయింది యశోదకి. ఎవరినోట విన్నా వదిన - వదిన. ఒక్క నెలరోజులపాటు ఆస్పత్రిలో ఉండి వచ్చేసరికి అమ్మ ఎంత పనికిరానిదైపోయింది.

అన్నదమ్ములు భోజనాలు చేస్తున్నట్టున్నారు. వంటగదిలోనుంచి మాటలు విన్పిస్తున్నాయి.

"వదినా-బెస్టాఫ్‌లక్ చెప్పండి. ఈ ఇంటర్వ్యూ అయినా సక్సెస్ అవాలి'' సుధాకర్ అంటున్నాడు.

"నా విషస్ ఎప్పుడూ ఉంటాయి. మీ అమ్మ గారికి చెప్పి ఆమె ఆశీస్సులు తీసుకుని వెళ్ళండి'' వయసులో పెద్దవాడని కల్యాణి మరిదిని మీరు అంటుంది. వరసకి పెద్దదని అతను వదినగారిని మీరు అంటాడు.

'మీ అమ్మగారేమిటి? నీకేంకాదా' ప్రభాకర్ స్వరం కొంచెం కటువుగా ఉంది. వెంటనే సుధాకర్ జవాబు కూడా తీవ్రంగా విన్పించింది. "చెప్పావులేవోయ్ పెద్ద పండితుడివి. వదిన ఓసారి అత్తయ్యగారు అంటే నాకు గంటసేపటిదాకా అర్థంకాలేదు ఆవిడెవరో. అందుకని నేనే చెప్పాను మా అమ్మ అని చెప్పమని. వదిన్నయితే అంటావుగాని, నువ్వు మాత్రం అనవు మీ అమ్మ గారు మీ నాన్నగారు అని. సిగ్గులేకపోతేసరి.''

"మీ ఇద్దరికీ పోట్లాడుకోవడం తప్ప మాట్లాడుకోవటం చేతకాదనుకుంటాను'' కల్యాణి నవ్వింది. నిజమే. వాళ్ళిద్దరికీ ఏణ్ణర్థమే తేడా. చిన్నప్పటినించి తగాదాలే. మళ్ళీ ఒకళ్ళంటే ఒకళ్ళకి ప్రాణం... అనుకుంటుంది యశోద.

"చూడబోతే వదినగారి మీద ఈగ వాలనిచ్చేలా లేదు మరిది లక్ష్మణుడు'' నవ్వుతూ అంటున్నాడు ప్రభాకర్.

"నీ జీవితంలో నువ్వు చెప్పిన నిజం ఇదే రాఘవ్. సీతమ్మలాంటి వదిన వుంటే ఏమరిదైనా, లక్ష్మణుడే అవుతాడు. పెద్ద వెధవ్వి-నీకేం తెలుస్తుంది ఆ సంగతి. వచ్చే జన్మలో అయినా మా వదినలాంటి వదినకి మరిదిగా పుట్టే అదృష్టం పట్టాలని కోరుకో.'' యశోద ఒళ్ళంతా కారం రాచుకున్నట్లు అనిపించింది. ఏమిటి ఆవిడగారి గొప్ప. అందరూ నెత్తిన పెట్టుకునేవాళ్ళే. రెండు నెలల క్రిందటే తను ఈ కోడల్ని చూసుకుని

మురిసిపోయిన సంగతి యశోదకు గుర్తురాలేదు.

“మమ్మీ–” తల తిప్పి చూసింది. ఇవాళ ఇంటర్వ్యూ. అది సక్సెస్ అయి నీ రెండో కొడుకు బ్యాంకు ఆఫీసర్ కావాలని ఆశీర్వదించు” యశోద నవ్వింది. దగ్గరగా వచ్చి నిలబడ్డ కొడుకు చేతిని ఆప్యాయంగా తన చేతుల్లోకి తీసుకుంది.

“నీకు తక్షణం ఆరోగ్యం రావాలంటే నువ్వు రోజూ జాగింగ్ చెయ్యాలి. నా జీతం రానీయ్యి. నీకో జాగింగ్ సూట్ కొంటాను. ఓకే, గుడ్ బై. రారా ప్రభా” అతను హడావిడిగా వెళ్ళిపోయాడు.

“అరె. వాటెలక్ వదినా అడక్కుండానే ఎదురొచ్చారు. ఈసారి నా ఉద్యోగం, మీకు పట్టుచీర ష్యూర్” సుధాకర్ ఉత్సాహంగా అంటున్నాడు. “ఆదేం లేదు పనివుండి వచ్చాను. ఎనీవే, బెస్టాఫ్ లక్” కల్యాణి కంగారుగా అంటోంది. యశోద మనసు ముకిళించుకు పోయింది. అంతా నటన. తన శకునం మంచిదని అంత నమ్మకం కాబోలు. ఇన్నాళ్ళూ ఈవిడ శకునం వచ్చే తన పిల్లలు పెద్ద పరీక్షలు పాసయ్యారు కాబోలు. అయినా ఈ చదువుకున్న పిల్లలకు కూడా ఏమిటి చాదస్తాలు?

“అత్తయ్యా స్నానం చేస్తారా” కోడలి పిలుపు విని. ‘ఊ’ అంది ముభావంగా. నీళ్ళతోడి దొడ్లో పెట్టానని పిలుపు వచ్చిన తర్వాత పది నిముషాలకి మూలుగుతూ లేచి వచ్చింది. ఎంగిలి కంచాలు ఓ వైపు పెట్టి వున్నాయి. ‘మగవాళ్ళు వెళ్ళే ముందే కంచాలు కడగాలని ఎన్నిసార్లు చెప్పాను? ఏమైనా తెలియనైనా తెలియాలి. చెప్తే వినే గుణం అయినా వుండాలి.” మిగిలిన అంట్ల గిన్నెలన్నీ వెదికి తీసుకు వస్తున్న కల్యాణికి అత్తగారి సణుగుడు విన్పించి కన్నీళ్ళు తిరిగాయి. నిన్న మొన్నటిదాకా కన్న తల్లిలాగా చూసుకున్న ఈమె ఎందుకిట్లా మారిపోయారు? ఎవరైనా ఊరికి వెళ్తుంటే వాళ్ళు తిన్న కంచాలు కడగాలని తెలుసు తనకి. ఆఫీస్‌కి వెళ్ళేవాళ్ళకి కూడా ఆ నియమం పాటించాలంటే అన్ని పనులూ పని మనిషి కూడా లేకుండా ఒక్క చేతిమీదిగా చేసేటప్పుడు ఎట్లా కుదురుతుంది? మరోగంట తర్వాత బ్రతిమాలించుకుని, విసుక్కుంటూ అన్నం తిని, మందు వేసుకుని పడుకుంది యశోద.

మధ్యాహ్నం అవుతుండగా మధుకర్, ప్రమద్వర అన్నాలకి ఇంటికి వచ్చారు. ఇంటర్ ఫైనలియర్లో ఉన్న మధుకర్ సెవెన్త్ చదివే పిల్లాడిలా ఉంటాడు. రాగానే తల్లిదగ్గరికి వచ్చి, ‘అమ్మా, ఇంటర్ కాలేజ్ ఎస్సేరైటింగ్‌లో నాకు ఫస్ట్‌ప్రైజ్ వచ్చింది’ అన్నాడు సంతోషంతో కళ్ళు మెరుస్తుంటే. యశోదకి ముమ్మూర్తులా తనని పోలి ఉండే యీ కొడుకంటే పంచప్రాణాలు. కొడుకు చెంపలు నిమిరి “నా తండ్రి బంగారు కొండ. ఎప్పుడు రాశావు నాన్నా నాకు చెప్పలేదేం” అంది సంతోషంగా.

“ఓనెలఅయింది. ముందు భయపడ్డాను. వదినే ధైర్యం చెప్పింది. వదినకి చెప్పొస్తానమ్మా” అంటూ లేచి ఇంట్లోకి పరుగుతీశాడు. యశోద నిట్టూర్చింది. ఈ సంసారం మొత్తం తన చేతుల్లోనించి జారిపోతున్నట్లు అన్పించసాగిందామెకి.

“నిద్రపోతున్నావా?” భర్త పలకరింపు విని కళ్ళుతెరిచి చూచింది. “ఇవాళ ఎట్లా వుంది” అన్నాడాయన.

“బాగానే ఉంది ఇప్పటిదాకా రాలేదేం అన్నానికి” లేచి కూచుంటూ అంది యశోద. రిటైరైన తర్వాత నారాయణరావుగారు తనలాగే రిటైరైన ఫ్రెండ్స్‌తో కలిసి రియల్స్ ఎస్టేట్స్. డీలర్‌షిప్స్ వ్యాపారం ఆరంభించారు. “పని తీరలేదు. అన్నం తిన్నావా?” అని ఆమె జవాబు కోసం ఎదురు చూడకుండానే ‘అన్నం పెట్టమ్మా’ అని కోడల్ని ఉద్దేశించి కేకపెట్టారు. ‘నేను ఎదురుగానే ఉన్నానుగా. అన్నం కూడా పెట్టకూడదా నేను’ అనుకుంటూ యశోద మళ్ళీ కళ్ళు మూసుకుని పడుకుంది.

“నాన్నా–నాన్నా” అంటూ ప్రమద్వర వచ్చి తండ్రి మెడను రెండు చేతులతో చుట్టి “నాకో సిల్కులంగా కావాలి దీపావళికి కుట్టించవా” అంది గారాబంగా. నలుగురు కొడుకుల తర్వాత పుట్టిన ఈ కూతురంటే తండ్రికి ప్రాణాధికం. “ఎందుకు కుట్టించనమ్మా? ఏరంగులో కావాలి” అన్నాడాయన కూతుర్ని దగ్గరికి తీసుకుంటూ, “నీలంరంగు. వదిన అద్దాలు కుడతానంది” యశోద తేలు కుట్టినట్టు చూసింది. “మీ అమ్మ కూడా కుడుతుంది చిన్నమ్మా. తెలుసానీకు” అన్నాడు తండ్రి. “అమ్మదంతా పాత ఫాషన్. వదిన చక్కగా కుడుతుంది. నేపోతున్నా” అంటూ ఆ పిల్ల పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయింది. “వడ్డించాను రండి మామయ్యా” అన్న పిలుపు విని మామగారు భోజనానికి వెళ్ళారు.

కళ్ళుమూసుకుని ఆలోచిస్తోంది యశోద. ఏం చేస్తే తన స్థానం మళ్ళీ తనకి లభిస్తుంది.

యశోదకి నిద్రపట్టలేదు. గడియారం పది గంటలు కొట్టింది. టీవీ ఆపేసి అందరూ నిద్రలకి ఉపక్రమించారు. ఫైనలియర్‌లోకి వచ్చిన దయ వరండాలో చదువుకుని అక్కడే నిద్రపోతున్నాడు. మధు కూడా ఇవాళ అక్కడికే చేరాడు. ఇంట్లోని లైట్లన్నీ ఒకదాని తరవాత ఒకటి ఆరిపోయాయి. కానీ యశోదకి నిద్రరావటం లేదు. బెడ్‌లైట్ వెలుతురులో ఎదురుగా టీవీ కన్పిస్తోంది. ఇందాక టీవీలో భానుమతి పాట రాగానే అందరూ “వదినా- నీకిష్టం అయిన పాట” అని పిలిచినవాళ్ళే అమ్మకి కూడా భానుమతిపాట అంటే ఇష్టం అని ఒక్కళ్ళకీ గుర్తులేదు. కనిపెంచిన తన కంటె ఆపిల్ల ఇంతగా ఎక్కువైపోయిందా వీళ్ళకి.

ఎక్కడినించో సన్నగా ఏడ్చిన శబ్దం. ఉలిక్కిపడి, కూతురివైపు చూసింది. ప్రమద్వర హాయిగా తన చెవులపిల్లి బొమ్మని గుండెకి హత్తుకుని నిద్రపోతోంది. అది కల్యాణి చేసిన బొమ్మ అని యశోదకి తక్షణం స్ఫురించింది. ఏడుపు మళ్ళీ విన్పించింది.

“నేనేం తప్పు చేశానో నాకు అర్థం కావటం లేదు. అత్తయ్య ఎందుకిట్లా మాట్లాడుతున్నారు? సాయంత్రం కూర భాగ్యానికి అంత పోట్లాడాలా? నేనేం తప్పుగా అడిగానని” వెక్కిళ్ళ మధ్య కల్యాణి మాటలు విన్పిస్తున్నాయి. యశోద దుప్పటి ముఖంమీదికి లాక్కుని శ్రద్ధగా వినసాగింది.

“అదే నాకూ అర్థం కావటం లేదు. నువ్వంటే ఎంతో అభిమానంగా ఉండే మనిషి, జబ్బుపడి లేచిం తర్వాత ఎందుకిట్లా అయిందోమరి. డాక్టర్నడిగితే అంతా బాగానే ఉందంటాడు.” ప్రభాకర్ గొంతు బరువుగా ఉంది. హటాత్తుగా యశోదకి ఏడుపొచ్చింది. నిజమే. తనకేమయింది. కోడలు కాపురానికి వచ్చి సాంతం ఏడాది కాలేదు తను ఒళ్ళెరగని జబ్బుతో నెల రోజులు ఆస్పత్రిలో ఉంటే చిన్నపిల్ల కొత్తగా కాపరానికి వచ్చింది అయినా ఎంతో అనుభవం ఉన్నదానిలా అన్నీ సమర్థించుకుంది. ఇంటికి వచ్చిన యీ నెల నించీ మంచం దిగనివ్వకుండా చేస్తున్న కోడల్ని....

తలుపు తీసిన చప్పుడు ఆ వెంటనే “నువ్వింకా పడుకోలేదా నాన్నా,” అన్న ఆశ్చర్యపూర్వకమైన ప్రశ్న వినిపించి ఉలిక్కిపడింది యశోద. కోడలి

ఏడుపు మామ చెవిన పడ్డట్టుంది.

"లేదురా. అమ్మాయి మాటలు విని వచ్చాను." కుర్చీ లాగిన శబ్దం. "మీ అత్తగారి మాటలు నేనూ వింటూనే ఉన్నానమ్మా నాకూ కష్టంగానే ఉంది. అయితే, తను ఎందుకట్లా ప్రవర్తిస్తోందో నేను అర్థం చేసుకోగలిగాననుకుంటాను".

"ఎందుకు నాన్నా" ప్రభాకర్ ఆతృతగా అడిగాడు.

"ఆ బాధ నేనూ అనుభవించాను కనుక, జోక్ కాదు. ఇల్లంతా తానై తిరిగే మనిషి ఉన్నట్టుండి మంచం పడితే, అది ఎంత బాధ. రిటైరైన కొత్తల్లో నాకూ అట్లాగే ఉండేది. నా అవసరం ఎవరికీ లేదనే ఫీలింగ్. అది మనిషిని ఎంత తినేస్తుందో చెప్పలేను. మీ అమ్మ విషయం కూడా అంతే. దాదాపు ఇరవై ఎనిమిదేళ్ళనాడు పదహారేళ్ళ పిల్లగా ఈ ఇంట్లో అడుగుపెట్టింది. మా అమ్మ ఎప్పుడూ పెద్దకొడుకు దగ్గర ఉండేది. మీ అమ్మ వచ్చిననాటి నుండి ఒంటరి కాపురం. ఒకరి సలహా కాని, సహాయం కాని, అధికారం కాని లేదు. ఈ సామ్రాజ్యాన్ని నిరంకుశంగా ఇన్నేళ్ళపాటు పరిపాలించిన మనిషికి, ఉన్నట్టుండి ఒక మూల పడుకోవలసిరావటం ఎంత బాధ? ఆలోచించు. డాక్టర్లు తనకి పూర్తిగా విశ్రాంతి ఇవ్వాలన్నారని ప్రతి చిన్న పనికి కూడా అమ్మాయినే పిలవటంతో మీ అమ్మ మనసులో దిగులు ఏర్పడింది. మీ అమ్మ ఇంటికి పెద్దకోడలు కాదు. పెళ్ళయిననాటి నుంచి వేరు కాపురం నా ఉద్యోగరీత్యా. ఉమ్మడి కుటుంబంలో ఒకే వయసువాళ్ళయిన వదినా మరదులు ఎంత స్నేహంగా ఉంటారో ఆవిడకి అనుభవంలోకి రాలేదు. నా తమ్ముళ్ళు, చెల్లెళ్ళతో ఆవిడకి ఇంటిమసీ ఏర్పడలేదు. అందుకే పిల్లలందరూ వాళ్ళ వదినతో చనువుగా ఉంటే సహించలేకపోయింది. పైగా ఇన్నాళ్ళూ తను బాధ్యత వహించి నిర్వహించిన సంసారభారాన్ని ఇవాళ కోడలి చేతిలో అప్పగించటానికి మీ అమ్మకి మనసొప్పటం లేదు. హాయిగా బాధ్యత మీకు అప్పగించి విశ్రాంతిగా ఉండాల్సిన వయసులో ఆ భారం లేకపోతే తన స్థానమే. పోతుందని వెర్రి భ్రమలో పడి కొట్టుకుంటూంది. చెప్పకుండానే అన్నీ గ్రహించుకుని భారం నెత్తికెత్తుకునే కోడలు ఎంత అదృష్టం చేసుకుంటే దొరుకుతుంది! పిచ్చిది! పరాయి సంబంధం అయినా అట్లాంటి కోడలు దొరికిందని సంతోషించక, తన విలువ పోతుందని భయపడుతోంది మీ అమ్మ. అదే ఆవిడ కోపానికి కారణం. అంతే తప్ప నువ్వు చేసిన లోపం ఏమీ లేదమ్మా."

ప్రభాకర్ గట్టిగా నిట్టూర్చి "మరి ఇప్పుడేం చేద్దాం నాన్నా" అన్నాడు. "చేసేదేముంది. రేపట్నించి మీ అమ్మని మామూలుగా చేసే పనులు చెయ్యమని అడగండి. అన్నింటికీ అమ్మాయిని పిలవటం తగ్గించండి. నీ పెళ్ళికి ముందు అందరూ అమ్మా అమ్మా అని ఎట్లా కలవరించేవాళ్ళో అట్లా ఓవారంపాటు చెయ్యండి. ఆవిడ రోగం తక్కున తగ్గుతుంది" అన్నారు రావుగారు నవ్వుతూ. యశోద కూడా కన్నీళ్ళతో నవ్వుకుంది.

"మీ అమ్మ మనసు చెడ్డదికాదు. మెల్లగా తనే గ్రహిస్తుంది కోడలు వచ్చి తనకి విశ్రాంతి ఇచ్చిందని. దీపావళి వెళ్ళగానే ఉత్తరాది తీర్థయాత్రలకు వెళ్దామని ఉంది. ఏమంటావురా? ఇల్లూ పిల్లలూ జాగ్రత్తగా చూస్తారా మరి."

"అమ్మని కూడా తీసుకువెళ్తావా."

"వెళ్ళరండి మామయ్యా, ఒంట్లో ఓపిక ఉన్నప్పుడు ఇప్పుడు కాకపోతే ఎప్పుడు వెళ్తారు" కల్యాణి గొంతు.

"నన్నందరూ దశరథుడి అంత అదృష్టవంతుడివి అనేవాళ్ళు. నా పెద్దకోడలు కూడా సీతమ్మలాంటిదే వచ్చిందమ్మా. ఇవాళ కాకపోతే రేపైనా మీ అత్తయ్య నిజం తెలుసుకుంటుంది అది ఉత్త పిచ్చిదమ్మా. దాన్ని అపార్థం చేసుకోకు. దాని బదులు నేను క్షమాపణ చెప్తున్నాను" నారాయణరావుగారి స్వరం జీరబోయింది. యశోద మనసు ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోయింది.

'ఛా. అవేంమాటలు నాన్నా. అమ్మ మనసు మాకు తెలీదా' అంటున్నాడు ప్రభాకర్. యశోద మెల్లగా నిద్రపోవటానికి ప్రయత్నించసాగింది. ఇన్నేళ్ళ కాపురం తను ఎవరి సలహా లేకుండానే చక్కబెట్టుకొచ్చింది. ఇప్పుడు మాత్రం తను ఒకరిచేత ఎందుకు సలహా చెప్పించుకోవాలి?

తెల్లవారుతుండగా నిద్రలేచి వంటగదిలోకి వచ్చిన కల్యాణి బిత్తరపోయింది. స్టౌమీద డికాషన్ నీళ్ళు కాగుతున్నాయి. యశోద బాత్‌రూం ముందు కూచుని ముఖం కడుక్కుంటోంది. కోడల్ని చూసి నవ్వి, "లేచావా? కాసేపు పడుకోలేకపోయావా" అంది. కల్యాణికి తను అత్తగారింటికి వచ్చిన మొదటి రోజులు జ్ఞాపకం వచ్చాయి.

ఆవాళ వంట యశోద చేసింది. కూచుని అందరికీ అన్నాలు పెట్టింది. తిరిగే పని అంతా కోడలు చేస్తే కూచుని చేసేపని అంతా తను చేసింది. పిల్లలు తల్లి లేచి తిరుగుతుంటే సంతోషంగా చుట్టూ తిరిగారు.

మధ్యాహ్నం భర్తకి భోజనం వడ్డిస్తూ చెప్పిందామె. "కోడల్ని ఓ వారంపాటు పుట్టింటికి వెళ్ళరమ్మన్నాను. పూర్ణమ్మగారూ వాళ్ళంతా ఉత్తరాది యాత్రలకి వెళ్తున్నారట. మనం కూడా వెళ్దాం. ఈలోపల ఓసారి వెళ్ళొస్తుంది. పాపం మూణ్ణెల్లు అయినట్టుంది వాళ్ళవాళ్ళని చూసి. సాయంత్రం మీతోబాటు నేనూ వస్తాను రామకృష్ణ మఠంలో ఉపన్యాసానికి. ఇంటికి వచ్చి వెళ్ళండి" అని. నారాయణరావుగారి ముఖం చిరునవ్వుతో కళకళలాడింది.

ఆ సాయంత్రం మామగారితో కలిసి ఆనందంగా రామకృష్ణ మఠానికి వెళ్తున్న అత్తగారిని చూసిన కల్యాణి ముఖం చంద్రోదయం అయిన తూర్పు దిక్కు అయింది. □



రచయిత్రి స్వీయ పరిచయం

పుట్టినతేదీ : 11—7—62

చదువు : నాగార్జున విశ్వవిద్యాలయం ద్వారా ఎమ్. ఏ. (తెలుగు) మొదటి తరగతిలో ఉత్తీర్ణురాలయ్యాను. ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా లింగ్విస్టిక్స్ రెండవ సంవత్సరం చదువుతున్నాను.

అభిరుచులు: పుస్తకపఠనం, తోటపని, రచనలు, లింగ్విస్టిక్స్ తర్వాత రిసెర్చి చెయ్యాలని కోరిక.

—కె. వాసంతి